# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులను దశలవారీగా పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ విద్యుత్ శాఖలో త్వరలో నియామక ప్రక్రియ చేపడతామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.
- ❖ గోదావరి పుష్కరాలను 2027 జూన్ 26 నుండి జులై 7 వరకు 6 జిల్లాలో ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.
- ❖ ఐసీసీ పురుషుల టీ-20 ప్రపంచ కప్ లో గ్రూప్-1 నుంచి దక్షిణాఫ్రికా సెమీ ఫైనల్ చేరుకుంది.

==========================

ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులను 2 వేల కోట్ల రూపాయలతో దశల వారీగా పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గడచిన 20 నెలల కాలంలో సాగునీటి ప్రాజెక్టుల కోసం 20 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని చెప్పారు. సాగునీటి రంగంపై ఈరోజు శాసనసభలో చేపట్టిన లఘుచర్చలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... 1,312 టీఎంసీల నీటిని రాష్ట్ర ప్రాజెక్టుల్లో నిల్వ చేసుకునే అవకాశం ఉందని, ప్రస్తుతం 793 టీఎంసీల నీటితో రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లూ కళకళ లాడుతున్నాయని వెల్లడించారు. చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి చేసి ఏలూరు, కృష్ణా జిల్లాలకు నీరు అందించేలా చర్యలు చేపడతామని.. మే 15వ తేదీన నారుమళ్లకు నీరు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భూగర్భ జలాల పెంపునకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతీ ఎకరాకూ నీరు ఇవ్వాలన్న లక్ష్యంతోనే పని చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

రాయలసీమ ఎత్తిపోతల పథకం మధ్యలోనే ఆగిపోవడానికి గత ప్రభుత్వమే కారణమని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శాసన మండలిలో ఈరోజు ప్రతిపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి రామానాయుడు సమాధానమిచ్చారు. సరైన ప్రణాళిక, అనుమతులు లేకుండానే రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని గత ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. రాయలసీమలోని 17 లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం కొనసాగుతోందని చెప్పారు. 3 వేల 850 కోట్ల రూపాయల వ్యయంతో హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను 730 కిలోమీటర్లు తీసుకెళ్లి.. శివారు భూములను సైతం సస్యశ్యామలం చేస్తున్నామన్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలియజేశారు.

========================

విద్యుత్ శాఖలో సిబ్బంది కొరతను భర్తీ చేసేందుకు త్వరలోనే నియామక ప్రక్రియ చేపడతామని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. శాసనమండలిలో ఈరోజు పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. నిరంతరాయ విద్యుత్ సరఫరా, రీస్టోరేషన్ పనుల కోసం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వంటి వివిధ పద్ధతుల ద్వారా నియామకమైన 18 వేల మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులో ఉన్న 5 వేల 580 మంది సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ లకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ద్వారా శిక్షణ అందించి వారి సేవలను వినియోగించేకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు. సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ లు విద్యుత్ శాఖకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే.. 77 శాతం పైగా ఖాళీలు భర్తీ అయ్యే అవకాశం ఉందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వివరణ ఇస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

========================

గోదావరి పుష్కరాలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఈరోజు రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యింది. దేవదాయ, దర్మధాయ  శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమీక్షా సమావేశానికి మంత్రులు కందుల దుర్గేష్, బి. సి. జనార్ధన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, గొట్టిపాటి రవి కుమార్, మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై మంత్రివర్గ ఉపసంఘం ఈ సందర్భంగా సమీక్షించింది. మహా కుంభమేలా తరహాలోనే గోదావరి పుష్కరాలను కూడా నిర్వహించాలని, 8 నుండి 10 కోట్ల మంది ఈ పుష్కరాలకు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. 2027 జూన్ 26 నుండి జులై 7 వరకు జరిగే గోదావరి పుష్కరాలను 6 జిల్లాలో ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. గతంలో ఉన్న 234 ఘాట్ల సంఖ్యను 4 వేల 516 మీటర్ల పొడవు మేర 373 ఘాట్లకు పెంచేలా ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది.

విరామం

========================

విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శాస్త్రీయ పరిశోధనల్లో పురోగతిపై రేపటి నుండి రెండు రోజుల జాతీయ సింపోజియంను నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ తెలిపారు. ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈరోజు మాట్లాడుతూ... సదస్సులో పాల్గొనడానికి 9 మంది నిపుణులు వస్తున్నారని, వీరిలో నలుగురు భట్నాగర్ అవార్డు గ్రహీతలు ఉన్నారని చెప్పారు. మార్చి 5న 10 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటైన అరబిందో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తామన్నారు. ఏయూ ఆచార్యులుగా పని చేసి విభిన్న విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులుగా పని చేసిన ఆచార్యులతో త్వరలో ప్రత్యేకంగా ఒక ప్యానెల్ డిస్కషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అనుబంధ కళాశాలల విద్యార్థులకు ఏయూ మౌలిక వసతులు, ప్రయోగశాలలు పరిచయం చేస్తూ.. సమ్మర్ ఇంటర్న్ షిప్ అందించాలని  నిర్ణయించామన్నారు.

========================

రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. నేతన్నలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు చేనేత ఉత్పత్తుల విక్రయాలు పెంచేలా ఎగ్జిబిషన్లు, స్టాళ్లు ఏర్పాటు చేస్తోందన్నారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన చేనేత స్టాళ్లను మంత్రి పార్థసారథి ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ జిల్లాల నుంచి వచ్చిన చేనేత ఉత్పత్తులను, వాటి నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. నేతన్నల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వారికి వివరించారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయబోతున్నామన్నామని, చేనేత సహకార సంఘాలకు విడతల వారీగా బకాయిలు సైతం విడుదల చేశామన్నారు.

==========================

ఐసీసీ పురుషుల టీ-20 ప్రపంచ కప్ లో గ్రూప్ -1 నుంచి దక్షిణాఫ్రికా సెమీ ఫైనల్ చేరుకుంది. అహ్మదాబాద్ వేదికగా దక్షిణాఫ్రికా వెస్టిండీస్ జట్ల మధ్య ఈరోజు జరిగిన క్రికెట్ మ్యాచ్ లో దక్షిణాఫ్రికా 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. దక్షిణాఫ్రికా కెప్టెన్ మాకరామ్ 82 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అంతకముందు బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ దక్షిణాఫ్రికాకు 177 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇక మరోవైపు చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా భారత్, జింబాబ్వే జట్ల మధ్య టీ 20 క్రికెట్ మ్యాచ్ ఈ రాత్రి 7 గంటలకు ప్రారంబమవుతుంది. ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ సూపర్-8లో భాగంగా జరుగుతున్న ఈ మ్యాచ్ లో విజయం సాధించినట్లయితేసే గ్రూప్ 1 నుంచి భారత్ సెమీఫైనల్ చేరేందుకు అవకాశాలు సజీవంగా ఉంటాయి.

==========================

శాసన మండలిలో మార్చి 4వ తేది తిరుపతి లడ్డు అంశంపై లఘు చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. బిఏసి సమావేశంలో నిర్ణయం తీసుకున్న ప్రకారం శాసన మండలిలో తిరుపతి లడ్డు ప్రసాదంపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. శుక్రవారం వ్యవసాయ శాఖపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. శాసన మండలిలో తిరుపతి లడ్డు అంశంపై రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామ్ నారాయణ రెడ్డి స్టేట్మెంట్ ఇచ్చే ప్రయత్నం చేస్తుంటే.. విపక్ష సభ్యులు అడ్డుతగలడం సరికాదని పేర్కొన్నారు.

==========================

దక్షిణ అంతర కర్ణాటక దాని పరిసర ప్రాంతాలలోని నిన్నటి ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో వాయువ్యం, ఆగ్నేయ దిశగా గాలులు వీస్తున్నాయని.. వీటి ఫలితంగా ఉత్తరాంధ్రలో తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

==========================

==========================